# భాష

బస్ దిగిన అప్పారావుని అందరూ ఆశ్చర్యంగానూ, వింతగానూ చూడటం గమనించి గజానికొకసారి నడకలో స్టయిల్ మార్చుతూ, నిముషానికొకసారి కళ్ళజోడు సరి చేసుకుంటూ, నిముషానికి నిముషానికి మధ్య ఒకసారి హెయిర్ స్టయిల్‌ను సవరించుకుంటూ వడివడిగా అడుగులేస్తూ, చకచకా ఇల్లు చేరాడు.

వాళ్ళ నాయనమ్మ గడపలోనికి ఎదురొచ్చి ఆశ్చర్యంగా "అమ్మో! అమ్మో! మా అప్పిగాడే! ఎంత మారిపోయినావురా నీ జిమ్మడ. నా దిష్టే తగిలేలా వుంది" అంటూ ప్రేమగా వేళ్ళు విరుసుకున్నది దిష్టితీసినట్లుగా.

"ఓయ్ మునలీ! గట్లా పరిషాన్ అయితవేందే. ఎలా వుందే మన గెటప్. అవ్ మునలీ నేనింత ఖతర్నాకు మార్నానో చూసినావ్."

రత్తాలమ్మ ఆశ్చర్యంతో మాటలు రాలేదు. వెళ్ళేముందు నాన్నమ్మ అనే వాడు ఇప్పుడు మునలి అంటున్నాడేమిటా అని విస్తుపోయింది.

"గట్లా చూస్తావేందే? తాతకేడికోయిందే. నేను కొలువు చేస్తుండానని లెటరు రాస్తే జవాబు గట్లా రాయలేదేమ్టి?"

"అవున్రా అప్పీ..."

"అప్పి గిప్పి జాన్దానై. మనం గిప్పుడు గప్పారావునన్న మాట. అవును కూచోనీకి కురిచీలు లేవేంది? ఈ చింకి చాపలేందే?"

రత్తాలమ్మా అవాక్కయి పోయింది.

చక్కని భాషను వదిలి ఈ దిక్కుమాలిన భాష ఏమిటో అర్థం కాలేదు.

'అవ్ ముసిలీ! ఏందలా నూస్తవు? నాకేమైనా చాయ్ గిట్లా తాపిస్తావా లేదా? వచ్చిన నంది చూస్తా నీకింత గూడా మర్యాద గట్లా తెల్దా ఏంది?"

రత్తాలమ్మకు గుండెలు బాదుకుంటూ ఒక్క ఉదుటున బయట పడింది భయంగా. అప్పారావుకు అర్థం కాలేదు. వీధిలోకెళ్ళి పెద్దగా శోకాలు పెడుతూ "రంగయ్య, రావాలు, కుచలమ్మ, నాంచారమ్మా, మట్లాడరండి రండి రోయ్! నా మనవడికి ఏదో దయ్యం పట్టింది తోయ్" అన్నది.

రత్తాలమ్మ కేకకు గబగబా జనం పోగయ్యారు. అందరికీ జరిగింది వివరించింది. అందరూ ముక్కున వేలేసుకున్నారు (నోట్లో వేలేసుకుంటే బాగుండదు కదా) నిజంగానే దయ్యం పట్టిందంటే దయ్యం పట్టిందనే తీర్మానం చేశారు.

అప్పారావును బయటకు లాక్కొచ్చి ఇంటికెదురుగా వున్న చెట్టుకు కట్టేశారు. భూతరాజుకు కబురు చేశారు.

"పూర్వం ఒకడు చదువుకొనక ముందు కాకరకాయ అని తీరా చదువుకున్న తరువాత కీకరకాయ అన్నాడట. అలా వుంది రత్తాలొదినా నీ మనవడి నిర్వాకం" అన్నాదొకావిడ కొండంత సానుభూతి తెలియచేస్తూ.

"నాలుగుతన్నండి పట్టిన దయ్యం వదులుతుంది. ఇది హైదరాబాద్ దయ్యంలా వుంది. అక్కడి దయ్యాలు ఇలాగే మాట్లాడు




తాయట." తెలిసునన్నట్లే చెప్పాడు ఒకతను.

అప్పారావు మాత్రం "వదులుస్రి. నాతో నకరాలేస్తే నారలు తీస్తామల్లా. చేతులు నొస్తున్నాయిబే. మీకు గింతకూడా తెల్వి లేదురా" కోపంగా అరుస్తున్నాడు.

"అదిగదిగో ఆ చూపులు, ఆ చేష్టలు దెయ్యానికి సంబంధించినవే. చచ్చినా వదలకండి" అన్నాడొకాయన.

"దయ్యం పట్టిన వాడి కళ్ళలో వుగాకు గట్టిగా నమిలి ఊస్తే దయ్యం దెబ్బకు దిగుతుందట. చిన్నప్పుడు మా తాత చెప్పాడు. నేనా పని చేయనా?" చాలా ఆసక్తిగా ముందుకొచ్చాడొకాయన.

"అదే కాదు. చుట్ట ఎర్రగా కాల్చి మొహాన కాలిస్తే దెయ్యం వదులుతుంది." అన్నాడొకాయన అనుభవంతో చెబుతున్నవాడిలా ఫోజు పెట్టి.

అప్పారావుకు దడ పుట్టింది. కుయ్యో, మొర్రో అని మొత్తుకున్నాడు. అయినా ఎవరూ వినే పరిస్థితిలో లేరు.

అంతలో హంగామా, హడావిడి చేస్తూ రానే వచ్చాడు భూతరాజు. జనం ఒక్కరొక్కరే ఎక్కవయ్యారు.

భూతరాజు ఒక చేతిలో నిప్పులకుండను పట్టుకుని మరో చేతిలోని వేప మండలు ఊపుతూ బొడ్డులో దోపుకున్న సంచిలోని గుగ్గిలం నిప్పులమీద చల్లి ఆ పొగను అప్పారావు మొహంలో పెడుతుంటే అతను గగ్గోలు పెడుతున్నాడు.

"ఎక్కడి దయ్యానివే నువ్వు. ఈ భూతరాజు వుండగా నువ్వు ఊరిలో ప్రవేశించావంటే నీ ధైర్యం ఎంతైనా మెచ్చుకోవాల్సిందే. చెప్పు. చెప్పు." వేప మండలతో విరగబాదుతున్నాడు అప్పారావుని.

అప్పారావుకు దగ్గు తెరలు తెరలుగా వస్తున్నది. బాధ భరించలేకపోతున్నాడు. అయినా వదిలేలా లేడు. వెంటనే అప్పారావు మనసులో బల్బ్ వెలిగింది. అంతే! "నాయనమ్మా రక్షించవే. వీళ్ళు నన్ను చంపేస్తున్నారు" పెద్దగా అరిచాడు.

అప్పారావు నాన్నమ్మను, తాతయ్యను ఒప్పించి సిటీలో ఉద్యోగం సంపాదించుకుంటానికి హైదరాబాద్ వచ్చాడు. చిన్నప్పుడు చీమిడి ముక్కల నాటి స్నేహితుడి అడ్రస్ పట్టుకుని సిటీ బస్టాండ్‌లో ఎర్ర బస్ దిగాడు. చేతిలో సంచి ఒంటికి పంచె వున్న అప్పారావును చూసి వీడెవడో మరీ టింగరి వాడిలా వున్నాడనుకుని ఆటోవాళ్ళు చుట్టుముట్టారు. చివరకు ఓ ఆటోవాలా అప్పారావు చేతిలోని సంచిని లాక్కుని "ఏందిబే గట్లానూస్తవు. ఆటో ఎక్కు మల్లా" అన్నాడు.

"అమ్మో! నేను చచ్చినా ఆటో ఎక్కను. మా నాయనమ్మ ముందే చెప్పింది మీలాంటి వాళ్ళ ఆటో ఎక్కవద్దని. నేను బస్‌లోనే వెళతాను." చెప్పాడు బిక్కమొహం వేసుకుని.

"బస్‌లో పోతావ్! టైల్ తీసి ఆటోలో

పెట్టినా, నరకాల్ చేయకు. ఆటోలో కుచో."
ఆటోవాలా గదమాయించాడు.

పదవ తరగతి పాసయిన తననే యింతగా మోసం చేస్తున్నారు తన వూరి వాళ్ళు వస్తే ఎలా వుంటుందో అనుకుంటూ భయం భయంగా ఆటో ఎక్కి కూర్చున్నాడు. ఆటోస్టార్ట్ చేసే టప్పటికి ఆ కుదుపుకు ముందుకు పడి "అమ్మో!" అన్నాడు బాధగా. రక్తం వస్తున్నదే మోనని చూచుకున్నాడు.

"ఏయ్ పొద్దుగాల, పొద్దుగాల అలా ఏడుస్తావేందిబే? జరా నవ్వు ఫేస్ పెట్టుకోరాదు" అంటూ ఆటోను ముందుకు వురికించాడు.

ఆటో ఎగిరెగిరి పడుతున్నది. నడుం నొప్పితో గిలగిలలాడి పోతున్నాడు అప్పారావు. "ఏంటిది? ఆటో రోడ్డుమీద నడుస్తున్నదా లేక కొండలమీద వెళుతున్నదా? కొంపదీసి మనం పర్వతారోహణం చేయడం లేదు కదా!" తను వేసిన జోకుకు తనే విరగబడి నవ్వుకున్నాడు అప్పారావు.

"దమ్మాకు ఖరాబయినదా గట్లా నవ్వుతావ్! ఏం మాటాడుతున్నావో సమజయితున్నదా? మా సిటీలో రోడ్లు గిట్లనే వుంటాయి. రోడ్లు పాడయిన చే సాల్‌కు రోడ్లు ఏస్తరు. రోడ్లేసిన దో మైనేకు పాడయితయి. జరా చక్కగా కూచోరాదూ" చెప్పాడు ఆటోవాలా.

ఓరి భగవంతుడా? తనుండే పల్లెటూరి రోడ్లు చాలా బాగుంటాయి. సుందరమైన నగరమని వచ్చాను అనుకుని బాధపడుతుండగా కంపు, భయంకరమైన కంపు, భరించరాని కంపుకు కడుపులో తిప్పగా ఉలిక్కిపడిన అప్పారావు నర్రున వంచెను పైకి లాక్కుని ముక్కు మూసుకున్నాడు. ఆ వాసనకు ముక్కు పుటాలు పగులుతున్నాయి. ఆటో రెండు మూడు నిమిషాలు ప్రయాణించే వరకు ఆ వాసన వస్తూనే వున్నది.

ఛీ..ఛీ.. దరిద్రపు కంపు. ఆ మధ్య కత్తిపోట్లలో చచ్చిన వారిని దహనం చేయకుండా రోడ్డు పక్కన పడేశారా ఏమిటి?" అనుమానంగా అడిగాడు అప్పారావు.

"అదేందివయ్య గామాత్రానికే గిట్లా పరిషాన్ అయితే ఎట్లా. గిది మా సిటీలో అందరికి గలవాటయి పోయి గా ఆసనలేకపోతే గుబులు పడతరు. గందుకు మా మున్సిపాలిటీ వోల్లు సహాయపడతారు" అంటూ ఆటోను సరాసరి పెట్రోల్ బంకులోనికి తీసుకెళ్ళి రెండు లీటర్ల పెట్రోలు పోయించుకుని డబ్బులు మాత్రం అప్పారావు చేత యిప్పించి ఇక్కడ యింతే అని బుకాయించాడు. అప్పారావుని అప్పుడు అడిగాడు వెళ్ళవలసిన అడ్రస్. అప్పారావు జేబులోని కాగితం తీసి చూపించాడు.


"గీ అడ్రసా! చానాదూరం పోవాలే. కూచో. కూచో" అని బయలు దేరాడు. అతను మాట్లాడేది అర్థంకాక అప్పారావు బుర్ర గోక్కుంటున్నాడు.

ఆటో టక్కున ఓ చోట ఆగింది.

ఆటోవాలా "దిగుబే" అన్నాడు. అప్పారావుకు అర్థంకాక క్రిందకు దిగాడు.

"ఏంది బే గట్లా చూస్తవు? జరా ఛాయ్ తాపిస్తవా లేదా?" అన్నాడు. అర్థంకాని అప్పారావు తెల్లమొహం వేశాడు.

"ఛాయ్ అంటే టీ అన్నమాట. గీ ఓటల్లో ఛాయ్ మంచిగుంటది. ఈడ ఛాయ్ తాగి నిమ్మళంగా పోదాం. ఏమంటావ్! నువేం [illegible] నువ్వు కొత్తగా సిటీకొచ్చినావు గదా! గామాత్రం ఛాయ్ తాపించవా?" అంటూ భుజం మీద చేయి వేసి లోపలకు నడిపించుకు వెళ్ళా. అప్పారావు సంచీని మాత్రం వదలలేదు.




బిల్లు అప్పారావు చేత యిప్పించి రోడ్లన్నీ తిప్పి తిప్పి బస్ డిపోకు రెండు కిలోమీటర్ల దూరంలో వున్న అడ్రస్ దగ్గర ఆపాడు. "చాలా దూరం తీసుకొచ్చావ్. ఈ అయిదు రూపాయలుంచు" యిచ్చి లోపలకు నడిచాడు అప్పారావు.

రెండు లీటర్లకు డబ్బులిచ్చిన అప్పారావు ఆ సంగతే మరచిపోయాడు. ఆటోవాడు నవ్వుకుని ఆటోని స్టార్ట్ చేసుకుని వెళ్ళి పోయాడు.

ఫ్రెండ్ ఆఫీసుకు వెళ్ళడంతో మధ్యాహ్నం హాయిగా నిద్రపోతున్నాడు అప్పారావు. తలుపు చప్పుడుకు మెలకువ వచ్చి తిట్టుకుంటూ వెళ్ళి తలుపు తెరిచాడు. గడపలో ఇంటిగలావిడ మొహాన రూపాయి బిళ్ళంత బొట్టు పెట్టుకుని, జుట్టు విరబోసుకుని, పాన్ నములుతూ నిలబడి వున్నది. అప్పారావు ఉలిక్కిపడి భయంగా ధూ...ధూ... అన్నాడు.

"ఏందన్నా గట్లంటివి? నీ పేరేందన్నా?" అడిగింది. అప్పారావు చెప్పాడు.

"అవ్ అన్నా నువ్వు కాలీ గున్నావుగందా జరా ఇస్కూలుకెల్లి మా పోరీని తోల్కుని రారాదే" అడిగిందామె.

అప్పారావు అయోమయంగా చూస్తున్నాడు. [illegible] అర్థం కాలేదు.

"గదేంటన్నా గట్లా బెల్లం కొట్టిన రాయిలా చూస్తున్నావు" అనేటప్పటికి అప్పారావు ఉలిక్కిపడి దభీమని తలుపు మూసుకున్నాడు.

"ఈ పొరగాడికేమైంది గట్ల చప్పుడు చేయకుండా పోయిండు." సణుగుతూ వెళ్ళి పోయిందామె.

**********

అప్పారావు ఫ్రెండ్ డ్యూటీనుండి వచ్చేటప్పటికి వంట చేద్దామనుకుని కూరగాయల మార్కెట్‌కు వెళ్ళాడు. వంకాయిలు తీసుకుని "ఎంత" అని అడిగాడు.

"బారణా" అనేటప్పటికి అంటే ఎంత అని అడగటానికి మొహమాటపడి రూపాయి యిచ్చి చక్కా వచ్చేశాడు.

ఆ విధంగా భాషను డెవలప్ చేసుకుని హైదరాబాద్ నగరంలో చలామణి అవుతు ఊరికెళ్ళిన అప్పారావు పడరాని పాట్లు అనుభవించాడు.

(హాస్యం హాస్యం కథలపై పాఠకుల అభిప్రాయాలను ఈ క్రింది చిరునామాకు తెలియచేయగలరు. మహర్షి, ఎ.పి.యస్.ఆర్.ఎ.సి.
38 నాగార్జునాహిల్స్, పంజాగుట్ట,
హైదరాబాద్-482.